

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబా పూలే

» అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబా పూలే అని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా సమాజం కోసం పోరాడిన సామాజిక దార్శనీకుడు పూలే అని కొనియాడారు. వర్ణ వివక్షను రూపుమాపడానికి, దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని తెలిపారు. కుల, లింగ వివక్షకు తావు లేకుండ విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే పూలే ఆలోచన విధానాన్ని ప్రతీఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, బీసీ సంక్షేమ అధికారి బి.కేశురాం, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి బి.రమేష్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి, మెప్మా పీడీ మల్లీశ్వరి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, డీపీఆర్వో వీసీ వెంకటేశం, బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్, వడ్డెర సంఘం ప్రతినిధి బోసు రవి, కల్లు గీత కార్మిక సంఘం ప్రతినిధి సుధాకర్ గౌడ్, జిల్లా రజక సంఘం ప్రతినిధి అజయ్, బీసి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

» పలువురికి గాయాలు



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందు భాగం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పట్టణంలోని ఫ్లైఓవర్‌పై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై బ్రేక్‌డౌన్ అయిన లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడుగులు పడ్డాయి. పేదల సొంతింటి కల నెరవేర్చడానికి శరవేగంగా నిర్మాణ పనులు జరిగేలా చర్యలు చేపడుతోంది. పైలెట్ ప్రాజెక్టు కింద మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసి.. పునాదులు తవ్వారు. కొన్నిచోట్ల బేస్మెంట్ స్థాయి వరకు పనులు పూర్తయ్యాయి. ఇళ్ల నిర్మాణం చకచకా జరుగుతుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పులుసుమామిడిలో బేస్మెంట్ దశలో ఇందిరమ్మ ఇల్లు

ముగ్గు పోసి.. పునాదులు తవ్వి!

ఇందిరమ్మ ఇళ్లకు అడుగులు

గ్రామాల్లో మొదలైన నిర్మాణాలు

పునాదులు, బేస్మెంట్ స్థాయిలో పనులు

పైలెట్‌గా మండలానికి ఒక గ్రామం ఎంపిక

జిల్లాలో 3,75,013 దరఖాస్తులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వివరాలు

వచ్చిన దరఖాస్తులు	3,75,013
స్థలం ఉన్నవి	47,000
స్థలం లేనివి	1,24,000
ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసినవి	300
పునాదుల వరకు వచ్చినవి	86
బేస్‌మెంట్ వరకు	58

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి) : నిలువ నీడలేని నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించింది. కొన్ని గ్రామాల్లో ముగ్గు పోసి పునాదులు తీయగా.. మరికొన్ని పునాదులు, బేస్మిట్ లేవల్ వరకు వచ్చాయి. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,75,013 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారందరికీ ఒకే సారి ఇల్లు మంజూరు చేసే అవకాశం లేకపోవడంతో తొలి విడతగా ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని అక్కడ పూర్తిస్థాయిలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారు.

జిల్లాలో మొత్తం 27 మండలాలు ఉన్నాయి. వీటిలో గ్రామీణ మండలాలు 21 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 3.75 లక్షల దరఖాస్తులు చేసుకున్నారు. వీటిల్లో స్థలం ఉన్నవి 74 వేలు ఉండగా, లేనివి 1.24 లక్షల దరఖాస్తులు ఉన్నాయి. 21 మండలాల్లో

మిగతా 8వ పేజీలో...

ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశాం



జిల్లాలో గుర్తించిన మండలానికి ఒక గ్రామంలో సొంతింటి స్థలం గల అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇంటి నిర్మాణాలకు ముగ్గు పోసి పనులు ప్రారంభించాం. జిల్లాలో ఇప్పటి వరకు 58 ఇళ్ల నిర్మాణం బేస్‌మెట్ స్థాయి వరకు వచ్చాయి. బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమ అవుతాయి.

డీసీ నాయక్, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి



పల్లెచెల్కతండా రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

ఆందోళన వద్దు

న్యాయం జరిగేలా చూస్తా

» పల్లెచెల్కతండా రైతులకు ఆర్డీవో హామీ

యాచారం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూముల్లో సరిహద్దుల గుర్తింపు, ఫెన్సింగ్ పనులను శుక్రవారం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప పరిశీలించారు. వారు పనుల గురించి రెవెన్యూ, టీజీఐఐసీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పల్లెచెల్కతండాలోని 184 సర్వే నెంబర్‌లో 18 ఎకరాల భూములను సాగు చేసుకుంటున్న రైతులతో ఆర్డీవో మాట్లాడారు. ఎంత మంది భూములు సాగు చేసుకుంటున్నారు.. మీ వద్ద ఏమైనా పత్రాలున్నాయా అని ఆర్డీవో ప్రశ్నించారు. చాలాకాలంగా ఇవే భూములను సాగు చేసుకొని బతుకుతున్నామని, మా దగ్గర ఎలాంటి పత్రాలు లేవని, మీరే న్యాయం చేయాలని రైతులు వేడుకున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీ ఆవేదనను కలెక్టర్, ఉన్నతాధికారులకు వివరించి న్యాయం జరిగేలా చూస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. సాగు చేసుకుంటున్న భూముల్లో ఫొటోలు దిగండని రైతులకు సూచించారు. భూముల వివరాలను నమోదు చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆర్డీవో ఆదేశించారు. కాగా, కోర్టు వివాదంలో ఉన్న తాటిపర్తి అటవీ ప్రాంత భూములను చదును చేయడానికి వస్తున్న జేసీబీలను కొంతమంది రైతులు అడ్డుకున్నారు. ఇది కోర్టు కేసులో ఉందని చెప్పగానే సీఐ లిక్కి కృష్ణంరాజు వాటిని వెనక్కి రప్పించారు.

రోడ్లపైనే చేపల విక్రయాలు

8

ఆమనగల్లులో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో

పోషకాహారంతోనే ఆరోగ్యం

» సీడీపీవో వినితాదేవి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రోజువారీ ఆహారంలో పోషకాలు ఉండేలా చూసుకోవాలని ఇబ్రహీంపట్నం సీడీపీవో కె.వినితాదేవి సూచించారు. పోషణ పక్షం-2025లో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం-1 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలు, బాలింతలు, పిల్లల తల్లులకు ఆహార వైవిధ్యం, చిరుధాన్యాల ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువ మోతాదులో తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. పిల్లలు జంక్‌ఫుడ్ తినకుండా ఇంట్లోనే ఆరోగ్యకర ఆహారాన్ని వండి పెట్టాలన్నారు. తినే ఆహారంలో వారంలో రెండుసార్లు చిరుధాన్యాలు ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఫుడ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, పెంటమ్మ, బాలమణి, విజయలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.



హైవేపై ధర్నా చేస్తున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు పామెన శ్రీజ్యోతి, మహిళా కార్యకర్తలు

పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

రాబోయే రోజుల్లో నిరసనలు ఉధృతం చేస్తాం

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

షాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు డిమాండ్ చేశారు. జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ పిలుపు మేరకు శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో ముంబై-బెంగళూరు జాతీయ లింకు రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. జై భీం, జై బాపు, జై సంవిధాన్, రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం, జ్యోతిబా పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా మహిళా పార్టీ అధ్యక్షురాలు పామెన శ్రీజ్యోతిభీంభరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి మహిళలకు ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. నిరసన కార్యక్రమాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి మహిళల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షురాలు అనితారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అశ్విని, పార్టీ మండల అధ్యక్షురాలు స్వరూప, సీనియర్ నాయకురాలు సమత, శైలజ, లలిత, అరుణ, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సావనైనా సస్తం... మా భూములివ్వం

ఈ భూములపైనే మా బతుకులు ఆధారపడ్డాయి

శివన్నగూడ బ్యాక్ వాటర్ భూనిర్వాసిత రైతుల ఆక్రందన

శ్రీమంతుగూడలో ప్రజాభిప్రాయ సేకరణ

మా బతుకుల్లో మట్టికొట్టొద్దు సారూ..



రైతులతో సమావేశమైన అధికారులు

మంచాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): "మా బతుకంతా ఈ భూమితోనే ముడిపడి ఉంది.. వాటిని లాక్కొని మా నోట్లో మట్టికొట్టొద్దు సారూ..."అంటూ శివన్నగూడ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ భూ నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శివన్నగూడ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వరదకాలువ మళ్లింపులో భాగంగా శ్రీమంతుగూడకు చెందిన సర్వే నంబర్ 45 నుండి 65లో ఉన్న 105 ఎకరాల భూమి ముంపునకు గురవుతుంది. మొత్తంగా ఇక్కడ 148 ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అధికారులు శుక్రవారం భూనిర్వాసిత రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. నీటిపారుదల శాఖ డీఈ సురేందర్‌రెడ్డి, ఈఈ రాములు, మంచాల తహసీల్దారు ప్రసాద్‌రావు, ఏఈఈ అండాలు ఈ సభలో పాల్గొని బాధిత రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ భూనిర్వాసితులకు ప్రభుత్వం మెరుగైన ప్యాకేజీ ప్రకటించిందని చెప్పారు. ఎకరాకు రూ.27లక్షల పరిహారం చెల్లించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అనంతరం బాధిత రైతులు మాట్లాడుతూ బయట మార్కెట్‌లో ఎకరం కోటి రూపాయల ధర పలుకుతుందని, రూ.27లక్షలు ఇస్తే మేమేం చేయాలంటూ అధికారులను నిలదీశారు. మెరుగైన ప్యాకేజీ ప్రకటించాలి, లేదంటే భూమికి భూమైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి దాకా భూ సర్వే జరగనిచ్చేదిలేదంటూ స్పష్టం చేశారు. దీనికి స్పందించిన అధికారులు రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.



సమావేశానికి హాజరైన శ్రీమంతుగూడ రైతులు

ఆర్ఆర్ ప్యాకేజీ కావాలి



మాకు రెండెకరాలు ఉంది. భూమి మా అమ్మపేరిట ఉంది. జీవనాధారం కోల్పోతున్నాం, మానోట్లో మట్టికొట్టొద్దు. భూసర్వేకు అంగీకరించేదేలేదు. లేదంటే ఇళ్ల జాగాలకు ఇచ్చినట్లు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి.

-మేతరి నర్సింహ, రైతు శ్రీమంతుగూడ

4 ఎకరాలు పోతుంది



ప్రాజెక్టు మా సావుకే వచ్చింది. నాకు ఉన్నది నాలుగు ఎకరాలు. భూమంతా పోతోంది. ఇక నేనేం చేయాలి. కుటుంబం ఎట్లా బతకాలి. కోటి రూపాయలు ఇస్తే భూములు ఇస్తం. లేదంటే సావనైనా సస్తం కాని భూములు ఇవ్వం.

- రమావత్ శ్రీను, రైతు శ్రీమంతుగూడ

కల్యాణం..కమనీయం

కడ్తాల్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు పోకల బస్వరాజ్, రాజమణి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి మూల విరాట్లను పట్టు వస్త్రాలతో ముస్తాబు చేసి అలంకరించారు. వేద పండితులు అంగటి మఠం భువనేశ్వర్ , జ్ఞానేశ్వర్, హరీశ్ శాస్త్రీ ల ఆధ్వర్యంలో భాజాభజంత్రీలు, వేదమంత్రోచ్చారణల నడుము కల్యాణ తంతును నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ్మా, పిప్పళ్ల వెంకటేశ్, వెంకట్ రెడ్డి, ప్రేమ్‌కుమార్,జ్ఞానేశ్వర్, రాజప్ప, నవమోహన్, లక్ష్మణ్‌జీ, సంతోష్, మల్లిఖార్జున్, దిలీప్‌కుమార్, సాయికుమార్, సరిత, భార్గవి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గజవాహనంపై బాలాజీ

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వసంతోత్సవం, గజవాహనంపై ఉత్సమూర్తులను ఆలయ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు వేంకటేశ్వరస్వామి నామస్మరణతో మార్మోగాయి. ఊరేగింపు అనంతరం ఆలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను నిలబెట్టారు. గురువారం అర్ధరాత్రి స్వామివారి కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్.రంగరాజన్, భక్తులు పాల్గొన్నారు.



గజవాహనంపై ఊరేగుతున్న చిలుకూరు బాలాజీ

పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి



మన్నెగూడ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ

పూడూరు, ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పూడూరు మండలంలోని మన్నెగూడ చౌరస్తాలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్ ధర రూ.50వేలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ విజయ్, అనంతయ్య, రాములు పాండు, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

కల్తీ జరిగితే సహించేది లేదు


బేకరీలో తనిఖీ చేస్తున్న అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీ జరిగితే సహించేది లేదని మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు హెచ్చరించారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, స్వీట్‌హౌస్, రెస్టారెంట్లు, బేకరీలు, కర్రీ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని నిర్వాహకులకు రూ.7 వేల వరకు జరిమానా విధించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, జవాన్లు శంకర్, వినోద్‌కుమార్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, మహేందర్ తదితరులు ఉన్నారు.

ఓఆర్ఎస్‌తో ఆరోగ్యమస్తు

వేడిమి నుంచి ఉపశమనం
డీ హైడ్రేషన్‌కు గురికాకుండా రక్షణ
ఉపాధి హామీ పని ప్రదేశాల్లో తప్పక అవసరం



చేవెళ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగల నుంచి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి. రానున్న రోజుల్లో సాధారణం కంటే అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో వడగాడ్పులు వస్తాయి. ఈ ఏడాది వాటి ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశాలుండనున్నాయి. ఇప్పటికే ఉక్కపోత పెరిగింది. శ్రామిక, ఉద్యోగ, వ్యాపారులు విధి నిర్వహణలో భాగంగా అనివార్య పరిస్థితుల్లో మండే ఎండల్లో తిరగక తప్పని పరిస్థితి. అలాంటి సమయంలో డీహైడ్రేషన్‌కు గురైతే ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్)ఎంతో ఉపశమనం కలిగిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

ఎండలతో తస్మాత్ జాగ్రత్త

గ్రామాల్లో ఉపాధి పనులు, ఇతరత్ర వ్యవసాయ పనులకు వెళ్లేవారు ఎక్కువగా ఉంటారు. ముఖ్యంగా మండుటెండల్లో పని చేయాల్సి ఉంటుంది. అటువంటి సమయంలో ఎండ ప్రభావానికి లోనుకాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎక్కువ నీరు తీసుకుంటూ, ఓఆర్ఎస్ వంట ప్యాకెట్లను వెంట తెచ్చుకొని వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు.ం

ప్యాకెట్ల రూపంలో లభ్యం

ఓఆర్ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడిన ద్రావణం. 20.5 గ్రాముల పౌడర్ ప్యాకెట్ రూపంలో దొరుకుతుంది. దీనిలో 2.6 గ్రాముల సోడియం క్లోరైడ్, 1.5 గ్రాముల పొటాషియం క్లోరైడ్, 2.9 గ్రాముల సోడియం సిట్రేట్, 13.5 గ్రాముల డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి. మితిమీరిన మోతాదులో తాగడము అనర్థాలకు దారితీస్తుంది.

వడ దెబ్బ తగిలే అవకాశం

వేసవిలో శరీరంలో సహజంగా నీటి శాతం తగ్గిపోవడంతో వడదెబ్బకు గురవుతుంటారు. ఇలాంటి ప్రమాదానికి గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణం ఉపకరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. స్థలం, కాలాన్ని బట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. సరిపోను నీటిని తాగకపోయినా, ఎండలో ఎక్కువగా తిరిగినా డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఈ స్థితిలో తల తిరగడం, నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్లు అనిపిస్తుంది. వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలు వడదెబ్బకు గురైనట్లు తెలియజేస్తాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య, ఆరోగ్య కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. సమయానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఉప్పు, పంచదార, నీటి సాయంతో ఈ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, అర స్పూన్ పంచదారను కలిపి తాగవచ్చు. ఎండ తీవ్రతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.

డీహైడ్రేషన్‌ను తగ్గిస్తుంది



వేసవిలో వడదెబ్బ భారిన పడిన వారు డీ హైడ్రేషన్‌కు గురవుతారు. అటువంటి సమయంలో ముందుగా ఓఆర్ఎస్ వినియోగించడం వల్ల కొంత వరకు కోలుకుంటారు. ఓఆర్ఎస్‌లో అన్ని రకాల మినరల్స్ ఉంటాయి. అవసరమైన వారు తీసుకోవచ్చు.

- డాక్టర్, రాజేంద్రప్రసాద్, చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

రోడ్డెక్కిన భగీరథ కార్మికులు

నిలిచిపోయిన తాగునీటి సరఫరా


మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కొడంగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలతోపాటు తమ సమస్యలను పరిష్కరించాలని మిషన్ భగీరథ కార్మికులు సమ్మె చేపట్టారు. దీంతో శుక్రవారం దౌల్తాబాద్, దుద్యాల, బొంరాస్‌పేట్ మండలాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని కార్మికులు తేల్చిచెప్పారు.

బీజేపీది రాజ్యాంగాన్ని మార్చే కుట్ర


గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీది భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర అని జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్‌లు ఆరోపించారు. పార్టీ ఏఐసీసీ పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్, దావుత్‌గూడతండా, పెద్దమ్మతండా గ్రామాల్లో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించేది కాంగ్రెస్ మాత్రమేనన్నారు. నాయకులు సరికొండ పాండు, ఎండీ అప్జల్ బేగ్, సౌడపు వెంకటేశ్‌గౌడ్, యాదయ్య, సరికొండ జగన్, కత్తుల వెంకటేశ్, ఎస్‌డీ అజీజ్, బాబు, చిర్ర సాయిలు, బుక్క పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనితీరును బట్టే ప్రజల్లో గుర్తింపు



సీఐ ప్రమోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది

ఆమనగల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పనితీరును బట్టే ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని సీఐ బోయిని ప్రమోద్ కుమార్ అన్నారు. ఆమనగల్లు సీఐగా 14 నెలలు సేవలందించి ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్తున్న ప్రమోద్ కుమార్‌కు శుక్రవారం పోలీసుస్టేషన్‌లో అభినందన వీడ్కోలు నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బంది ప్రమోద్‌కుమార్‌ను పూల మాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆయన సేవలను కొనియాడారు. ఎస్ఐ సీతారామ్‌రెడ్డి, ఏఎస్ఐ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవస్మరణ చేయాలి


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం


చేవెళ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవస్మరణ చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం అన్నారు. శుక్రవారం అల్లవాడలోని ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజల్లో బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, అదెట్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రావు



షాద్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ న్యాయస్థానం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది నర్వ వేణుగోపాల్‌రావు గెలుపొందారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని న్యాయస్థానంలో జరిగిన ఎన్నికల్లో ఆయన సమీప ప్రత్యర్థి న్యాయవాది జగన్మోహన్‌రెడ్డిపై నాలుగు ఓట్లక తేడాతో గెలుపొందారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

టీడీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి


న్యాయవాది కరీంకు సభ్యత్వం కార్డు ఇస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పని చేసిన టీడీపీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో టీడీపీ సభ్యత్వం కార్డుల పంపిణీలో భాగంగా పట్టణానికి చెందిన న్యాయవాది కరీంకు శుక్రవారం టీడీపీ సభ్యత్వం కార్డును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ గ్రామాన తిరిగి టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. టీడీపీ పుట్టింది బడుగుల అభివృద్ధి కోసమమేనన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ ప్రసూన కుమార్‌గౌడ్, నాయకులు నర్సింగ్‌రావు, దామోదర్ రావు, రాఘవులు, గందం ఆనంద్, సింగారం శ్రీనివాస్, కందూరి అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

చేవెళ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీన మొయినాబాద్ మున్సిపాల్ పరిధిలోని స్టార్ కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సబితారెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

జోరుగా గురుకులం పనులు

రూ.20 కోట్లతో జ్యోతిబాపూలే గురుకుల నిర్మాణం

- నిర్మాణ స్థలంలో బండరాళ్ల తొలగింపు
- ఎడ్యుకేషన్ హబ్‌గా మారనున్న కొడంగల్!
- తీరనున్న విద్యార్థుల ఇబ్బందులు



కొడంగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా కొడంగల్ జ్యోతిరావు బాపూలే గురుకుల పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. పట్టణ శివారులోని పరిగి రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ గురుకుల పాఠశాలను 20 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో ఆరో తరగతి వరకు సరిపోను వసతులు కల్పించారు. రానురాను ఎస్ఎస్‌సీ, ఇంటర్ వరకు పెంచారు. సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నా ముందుకు సాగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల నిర్మాణానికి కాంట్రాక్టర్ ఎలుగుబంటి సూర్యనారాయణ పనులు చేపట్టినా నాసిరకంగా ఉన్నాయని పనులు నిలిపివేశారు. అప్పటినుంచి ఉన్న తరగతి గదుల్లోనే కాలం వెళ్లదీస్తూ వచ్చారు. పాఠశాల స్థాయి పెరిగి ఇరుకుగా మారడంతో గురుకులాన్ని చేవేళ్ల ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. గురుకుల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించడంతో నూతన భవనాల నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది.

నిధులు మంజూరుతో పనులు వేగవంతం

గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి గురుకులాల అభివృద్ధికి కృషి చేసినా పలు కారణాలతో పనులు ముందుకుసాగలేదు. ప్రస్తుతం సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురుకుల భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేయడంతో పనుల్లో వేగం పెరిగింది. భవన నిర్మాణ స్థలంలో పెద్ద, పెద్ద బండరాళ్లు ఉండటంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. బండరాళ్లను ఆధునిక యంత్రాలతో తొలగిస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాల్లో తరగతి గదులు, డైనింగ్ హాల్, ఉండేందుకు వసతి ఏర్పాటు తదితర సదుపాయలు కల్పిస్తున్నారు. భవనం పూర్తయితే సౌలభ్యంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌కు చర్యలు

సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్‌హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొడంగల్‌కు మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, వ్యవసాయ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సమీకృత గురుకులాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం కొడంగల్‌కు మంజూరైన గురుకులాలకు స్థానికంగా స్థలం లేకపోవడంతో దూర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. వాటిని స్థానికంగా ఏర్పాటు చేసేందుకు కొడంగల్ పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ దగ్గర రూ.20 కోట్ల వ్యయంతో గురుకుల నిర్మాణం, దౌల్తాబాద్ మండలంలో మరో రూ.20 కోట్ల వ్యయంతో దేవరఫస్లాబాద్‌లో, బొంరాస్‌పేట్ మండలంలోని బురాన్‌పూర్ దగ్గర రూ.20 కోట్లతో గురుకులాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.


కొనసాగుతున్న నిర్మాణ పనులు

భవనం పూర్తితో విద్యార్థులకు మేలు



ప్రస్తుతం విద్యార్థులకు సరిపడే తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నూతన గురుకుల పాఠశాల భవన నిర్మాణం పూర్తయితే విద్యార్థుల సమస్యలు తీరుతాయి. నిర్మాణం పూర్తయితే ఇంటర్ విద్యార్థులు ఇక్కడే ఉంటూ చదువుకునే అవకాశం ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నూతన భవనం మంజూరవడం హర్షనీయం.

- నాగేశ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు కృషి



కొడంగల్ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. మెడికల్, వెటర్నరీ, ఇంజినీరింగ్, నర్సింగ్, వ్యవసాయ కళాశాలలతోపాటు సమీకృత గురుకులాలు, మండల కేంద్రాల్లో నూతన గురుకుల పాఠశాలల నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. స్థానికంగా విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుంది.

- తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీందార్లు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా అఖిల భారత కిసాన్ సభ చేసిన పోరు ఎన్నో ఫలితాలు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ముసలయ్య, రావుల జంగయ్య, తావూనాయక్, అంజనేయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ విరాళం


కేటీఆర్‌కు చెక్కును అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సం సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభకు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాష్‌రెడ్డి తనవంతు సహకారాన్ని అందిస్తున్నారు. పార్టీ కోసం రూ.25 లక్షల చెక్కును ఆయన శుక్రవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ అవినాష్‌రెడ్డిని అభినందించారు. పార్టీ కార్యకర్తగా కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ కేటీఆర్, హరీ‌ష్‌రావు, సబితాఇంద్రారెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అవినా‌ష్‌రెడ్డి పేర్కొన్నారు.

ద్యాచారంలో బీజేపీ నేతల పర్యటన

వికారాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేయడం, గ్రామస్థాయిలో సమస్యలు స్వయంగా తెలుసుకోవడమే లక్ష్యంగా గావ్ చలో- బస్తీ చలో కార్యక్రమం చేపడుతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోని ద్యాచారం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి కేంద్ర పథకాల లబ్ధిదారులను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని బసవేశ్వర విగ్రహం వద్ద స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆనందం, శిరీషాలం, చంద్రశేఖర్, యాదయ్య, రమేష్, ప్రసాద్ గౌడ్, నవీన్, విష్ణు, మంజునాథ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం తెలిపి చట్టం చేయడాన్ని నిరసిస్తూ ఘట్‌కేసర్‌లో శుక్రవారం ముస్లింలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఘట్‌కేసర్‌లోని జామ మసీదులో నమాజ్ ముగిసిన అనంతరం భారీ బ్యానర్, ప్లకార్డులు, జాతీయ జండాలతోపాటు నల్ల జండాలు పట్టుకొని మసీదు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు అబ్దుల్ అజీజ్, నబి, ఖయ్యూం, పారుక్, ఖలీల్, సిరాజ్, తాహెర్‌తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

ఆమనగల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డిలతో పంపిణీ చేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్, జగన్, సత్యం, వెంకట్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన విద్యార్థి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 290 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఇబ్రహీంపట్నం టౌన్ చైతన్యనగర్‌లో పలువురు విద్యార్థులు గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై చందర్ తన సిబ్బందితో దాడులు చేయగా ఓ విద్యార్థి గంజాయితో పట్టుబట్టాడు. తన స్వగ్రామం ఖమ్మం నుంచి తనకు తెలిసినవారి సాయంతో గంజాయి తెచ్చినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

ఆదిబట్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలను కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి పున్నయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని ఎస్ఎస్ హోటల్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో జర్నలిస్టుల పిల్లలకు విద్యను ఉచితంగా అందించాలన్నారు. పలువురు జర్నలిస్టులు టీయూడబ్ల్యూజే(143)కు రాజీనామా చేసి టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కార్యదర్శి పి. ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు జగదీష్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సైదులు, వార్త జిల్లా బ్యూరో చీఫ్ రఘుపతి, దిశ జిల్లా బ్యూరో చీఫ్ సురేష్, సాక్షి జిల్లా బ్యూరో చీఫ్ శ్రీశైలం, వార్త జిల్లా బ్యూరో చీఫ్ గణేష్, ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫర్ శ్రీనివాస్‌చారితో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వీడియోలు

- వ్యక్తిపై కేసు నమోదు

చౌదరిగూడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వీడియోలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. శుక్రవారం షాద్‌నగర్ రూరల్ సీఐ నరసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధి వనంపలి గ్రామానికి చెందిన సూరారం భూపాల్ శుక్రవారం మధ్యాహ్నం సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా పాటలను చిత్రీకరించిన వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. ఈ వీడియోలు వైరల్ కావడంతో గ్రామానికి చెందిన గందే రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామ, అల్లుడి మధ్య మటన్ చిచ్చు!

- అల్లుడిపై కత్తితో దాడి.. మామకు రిమాండ్

చౌదరిగూడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మామ, అల్లుడి మధ్య మటన్ చిచ్చు పెట్టింది. అల్లుడిపై మామ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిరలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ ఏఎస్ఐ ఛత్రీయ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎదిర గ్రామానికి చెందిన రవి గురువారం చౌదరిగూడలో జరిగే సంతకు కూరగాయాలు తీసుకువచ్చేందుకు వెళ్లాడు. సంతకు వెళ్లి మటన్ తీసుకురాకపోవడంతో మామ యాదగిరి అల్లుడు రవి మధ్య గొడవ జరిగింది. యాదగిరి కత్తితో దాడి చేయడంతో రవికి గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి యాదగిరిని రిమాండ్‌కు తరలించారు.

గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు భూములివ్వం

- లేమూరు, అగర్‌మియాగూడ గ్రామాల రైతులు


భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కందుకూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములు ఇచ్చేది లేదని లేమూరు, అగర్‌మియాగూడ గ్రామాల రైతులు మరోసారి తేల్చి చెప్పారు. రెవెన్యూ అధికారులు ఔటర్ రింగ్‌రోడ్డు రావిరాల ఎగ్జిట్-13 నుంచి మండలంలోని తిమ్మాపురం, లేమూరు, అగర్‌మియాగూడ, రాచులూరు, మీర్కాన్‌పేట రెవెన్యూ గ్రామాల్లో 330 ఫీట్ల వెడల్పుతో భూ సర్వే పనులు పూర్తి చేశారు. రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు ఇటీవల అధికారులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు మండంలోని లేమూరు పంచాయతీలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో లేమూరు, అగర్‌మియాగూడ గ్రామాల రైతులు మూకుమ్మడిగా సమావేశానికి వచ్చి డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు సుధాకర‌రెడ్డి, లిక్కి జంగారెడ్డి, ఢిల్లీ గణేశ్, కడారి జంగయ్య, పాండురంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం తమ భూముల గుండా గ్రీన్‌ఫీల్డు పేరుతో తమ భూములను తీసుకోవడాన్ని విరమించుకోవాలన్నారు. మీర్కాన్‌పేటలో నెలకొల్పనున్న ఫ్యూచర్‌సిటీ వద్దకు ఇప్పటికే 250 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేసి ఉందన్నారు. కానీ, 330 ఫీట్ల వెడల్పుతో మరో రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. తమకు రెండు, మూడు ఎకరాలు మాత్రమమే ఉన్నాయని, అందులో 90శాతం భూములు రోడ్డు కోసం సేకరిస్తే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ రాజు మాట్లాడారు. గ్రీన్ ఫీల్డు రోడ్డు ఏర్పాటుకు రైతులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, రైతులు ఇచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ నారాయణరెడ్డిని నివేదిక రూపంలో అందజేస్తానని తెలిపారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి


మున్సిపల్‌లో చిల్డ్రన్ పార్కును పరిశీలిస్తున్న శ్రీదేవి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి ఆదేశించారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పాల్గుణ్‌కుమార్‌తో కలిసి సమీక్షా నిర్వహించారు. ఇంటి పన్నులు 100 శాతం వసూలయ్యేలా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నల్లా నీళ్ల సరిపోకపోతే ట్యాకర్లతో అందించాలని సూచించారు. మున్సిపల్‌కు చెందిన భూములను కాపాడేందుకు చర్యలు తీసుకువాలన్నారు. చిల్డ్రన్ పార్కులను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. దుకాణాల అద్దె విషయాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సాయినాథ్, మున్సిపల్ కమిషనర్ యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లులు యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలని, జిల్లాలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, దానికి సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తడి, తాలు, దుమ్ము లేకుండా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైస్‌మిల్లుల యజమానులను సన్నవడ్ల దిగుమతుల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతు ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు సుగుణాబాయి, చంద్రకళ పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, షాద్‌నగర్ ఇన్‌చార్జి అందె బాబయ్య అన్నారు. బీజేపీ అధిష్టానం పిలుపుమేరకు 'గావ్ చలో- బస్తీ చలో' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులతో మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి మూడు రోజులపాటు కేంద్ర మంత్రి నుంచి కార్యకర్త వరకు గ్రామాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన పనుల ప్రగతిని పరిశీలిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణం, చెరువును పరిశీలించారు. ముద్ర రుణాలు పొంది లబ్ధి పొందిన వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్త, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంకనొళ్ల వెంకటేష్, నాయకులు అంజయ్య గౌడ్, బాబు, ఆనంద్, శివ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల్‌లో కేంద్ర బృందం పర్యటన

యాచారం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చడం అభినందనీయమని మినిస్ట్రీ ఆఫ్ రూరల్‌డెవలప్‌మెంట్ బృందం పంకజ్, చంద్రణ్ అన్నారు. శుక్రవారం యాచారం మండలంలోని మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఎంత మేర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు అందాయి, వాటిని దేనికోసం ఎంత మేర వెచ్చించారో అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించి అధికారులను అభినందించారు. డంపింగ్‌యార్డును చూసి తడి, పొడి చెత్తను వేరు చేసి వాడడం మంచిదన్నారు. వారివెంట ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత తదితరులున్నారు.

రోడ్ల నిర్మాణానికి కేంద్రం నిధులు

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

ధారూరు, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి కేంద్రం రూ.600 కోట్లు కేటాయించిందని, ఇందులో వికారాబాద్ జిల్లాకు నిధులు వచ్చాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ధారూరు, నాగారం, స్టేషన్ ధారూరు, రుద్రారం, అల్లీపూర్ గ్రామాల్లో రూ.30లక్షల ఎంపీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పక్షపాత ధోరణితో ఈ ప్రాంతం వెనుబడిపోయిందని, సిద్దిపేట వెళ్లి చూస్తే హైదరాబాద్ కన్నా ఎక్కువ అభివృద్ధి జరిగిందన్నారు. అక్కడ గ్రామాల్లోనూ ఫైఓవర్లు నిర్మించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాతం లేకుండా అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నారు. దురదృష్ట వశాత్తు మన్నెగూడ హైదరాబాద్ హైవే రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదని, గత పాలకులు రియల్ ఎస్టేట్ కోసం వంకరటింకర భూసేకరణ చేయటం వల్ల రోడ్డు పనుల ప్రారంభానికి అటంకాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మండలాధ్యక్షుడు రాజునాయక్, నియోజకవర్గ అసెంబ్లీ కోఆర్డినేటర్ వి.నందు, నాయకులు పాండు గౌడ్, వివేకానంద రెడ్డి, నరోత్తం రెడ్డి, ఎం.రమేశ్, రాజేందర్ గౌడ్, రవీందర్ గౌడ్, సాయిగౌడ్, కె.అంజయ్య, జగదీశ్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్ల: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 12న నిర్వహించే శోభయాత్రను విజయవంతం చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో హనుమన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. శోభయాత్రలో ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు దేవుని శర్వలింగం, శ్రీనివాస్, మాణిక్యరెడ్డి ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

శంషాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో మహాసభలు ఉంటాయని తెలిపారు. సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కార్మికులతో కలసి విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు నర్రాగిరి, శేఖర్‌రెడ్డి, మల్లేష్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫటా ఫట్

వందశాతం పన్ను వసూలే లక్ష్యం



- సుమతి, నందిగామ ఎంపీడీవో

నందిగామ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వంద శాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుమతి తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆమె తెలిపారు. ఈమేరకు 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: పన్ను వసూలు ఎంతమేరకు చేపట్టారు?

జవాబు: ఇప్పటివరకు మండలంలో 90 శాతం పన్నులు వసూలయ్యాయి. ఆరు గ్రామపంచాయతీల్లో ఇప్పటికే వందశాతం పన్ను వసూలు చేశాం. అన్ని గ్రామపంచాయతీల్లో వంద శాతం పన్ను వసూలు చేసేలా కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం.

ప్రశ్న: పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: గ్రామాల్లో ప్రతీరోజు ట్రాక్టర్ల ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నాం. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇచ్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్ణయించాం. చెత్త కుప్ప కనిపించకూడదని కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం.

ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మిషన్ భగీరథ నల్లాలు, బోరు బావుల ద్వారా తాగునీటిని అందిస్తున్నాం. తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. ఎక్కడైనా బోరు బావులు పాడైతే వెంటనే బాగు చేయిస్తున్నాం. ప్రజలు కూడా నీటిని వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: అక్రమ లేఅవుట్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఎక్కడైనా అక్రమంగా లేఅవుట్లు చేస్తే సదరు వ్యక్తికి నోటీసులు పంపిస్తున్నాం. గ్రామపంచాయతీ లేఅవుట్లలో ప్లాట్లు కొన్న వినియోగదారులకు ఎల్ఆర్ఎస్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

రోడ్లపైనే చేపల విక్రయాలు

- ఇబ్బందుల్లో వ్యాపారులు, కొనుగోలుదారులు
- అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణం



రోడ్డుపై చేపల విక్రయాలు



అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

ఆమనగల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని చేపల మార్కెట్‌కు నిర్దిష్ట స్థలం లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని ఏళ్లకాలంగా స్థానిక వ్యాపారులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. చేపలు, మాంసం, కూరగాయల విక్రయాలు ఒకేచోట జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం 2021లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి రూ.4.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో రెండెకరాలు స్థలం కేటాయించి 2021 నవంబరు 8న పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో రెండేళ్లుగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. విధిలేక పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో మాడ్గుల రోడ్డుపక్కన చేపల విక్రయాలు సాగిస్తున్నారు. ఆమనగల్లు పట్టణం హైదరాబాద్‌కు చేరువలో ఉంది. నాలుగు మండలాలకు కూడలిగా ఉంది. ఇక్కడ వందల మంది మత్స్యకారులు చేపల విక్రయాల ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. డిండి, నాగార్జునసాగర్, శ్రీశైలం, నాగర్‌కర్నూల్ తదితర ప్రాజెక్ట్ ఏరియాల నుంచి చేపలు కొనుగోలు చేసి తీసుకు వచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు. ఇక్కడ చేపల కొనుగోళ్లు బాగానే సాగుతాయి. ఇతర ప్రాంతాల వారు కూడా కొనుగోలుకు ఇక్కడికి వస్తుంటారు. షెడ్లు లేకపోవడం వల్ల కొనుగోలు చేసి తెచ్చిన చేపలను నిల్వ చేసుకోవడానికి వ్యాపారులు వేదనకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో చేపలు పాడై నష్టాలు చవిచూడాల్సి వస్తుందని వ్యాపారులు వాపోతున్నారు. తైబజార్ రూపంలో చేపల విక్రయం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం లభిస్తున్నా వ్యాపారులకు సౌకర్యాలు కల్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్థలం లేక రోడ్ల పక్కన విక్రయాల మూలంగా దుమ్ము, ధూళి కూడా చేపలపై పడి కొనుగోలుదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ అసంపూర్తి పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

మార్కెట్ సదుపాయం కల్పించాలి



చేపల విక్రయ దారులను, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఆమనగల్లులో చేపల విక్రయానికి ప్రత్యేక మార్కెట్ సదుపాయాన్ని కల్పించాలి. పెట్టుబడులకు రైతుల మాదిరిగా వడ్డీ లేనిరుణాలు ఇవ్వాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ పథకాలలో పెద్దపీట వేయాలి.

- మొక్తాల వెంకటయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ఆమనగల్లు

పనులు త్వరగా పూర్తి చేయాలి



ఆమనగల్లు పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణం పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి. కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు రోడ్లపై సాగిస్తుండడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. అన్నీ ఒకే చోట నిర్వహిస్తే సౌకర్యంగా ఉంటుంది.

- నుండూరు ఝాన్సీ, ఆమనగల్లు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత



మృతిచెందిన ఎద్దు వద్ద బాధిత రైతు

మాడ్గుల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని నర్సాయపల్లిలో చోటుచేసుకుంది. గ్రామ సమీపాన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇటీవల గాలి వానకు విద్యుత్ వైరు తెగి వేలాడుతూ ఉంది. అయితే, ఆ ప్రదేశంలోనే నీట సంపు ఉంది. ఈక్రమంలో గ్రామంలోని రైతు కడారి మల్లయ్యకు చెందిన ఎద్దు శుక్రవారం నీరు తాగడానికి అటువైపు వెళ్లడంతో విద్యుత్ వైరు తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ. 80వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. అయితే, విద్యుత్ వైరు వేలాడుతోందని లైన్‌మ్యాన్‌కు తెలిపినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఎద్దు మృతికి అధికారులే కారణమని అన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



రవి(ఫైల్)

శంకర్‌పల్లి, ఏప్రిల్ 11(ఆంధ్ర జ్యోతి): కొండాకల్ తండాకు చెందిన పాత్లావత్ రవి(33) అదృశ్యమయ్యాడు. భార్య తేజశ్రీతో గొడవపడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మోకిల సీఐ వీరబాబు కథనం మేరకు.. కొండాకల్ తండాకు చెందిన పాత్లావత్ రవి కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంసార విషయంలో భార్య తేజశ్రీతో ఈనెల 7న గొడవ పడ్డాడు. ఉదయం 10గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రవి బయటకు వెళ్లాడు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆయన సోదరుడు లక్ష్మణ్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భావితరాలకు ఆదర్శం జ్యోతిబా పూలే

- ప్రజాప్రతినిధులు, నాయకులు
- పూలే జయంతి సందర్భంగా ఘన నివాళి



చేవెళ్ల : నివాళులర్పిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్ : పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రజా సంఘాల నాయకులు

చేవెళ్ల/శంకర్‌పల్లి/షాబాద్/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మాడ్గుల/యాచారం/ఇబ్రహీంపట్నం/మహేశ్వరం/కందుకూరు/కొత్తూర్/మొయినాబాద్/షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ/కేశంపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే భావితరాలకు ఆదర్శమని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. పూలే 198వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, రామస్వామి, ప్రభులింగం, సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, సున్నపు వసంతం, గోపాల్‌రెడ్డి, ఆగిరెడ్డి, శర్వలింగం ఉన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ శంకర్‌పల్లిలోని పూలే విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ నారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రమోహన్, నాయకులున్నారు. గొప్ప సంఘ సంస్కర్త పూలే అని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీజ్యోతి, టీజేఎస్ అసెంబ్లీ ఇన్‌చార్జి రామకృష్ణ అన్నారు. షాబాద్ మండలం షాబాద్, నాగర్‌గూడ తదితర గ్రామాల్లో పూలే విగ్రహానికి నివాళులర్పించారు. సామాజిక అసమానతలు, కుల వివక్ష, అన్యాయాలను రూపుమాపడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో, హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పూలే చిత్రపటానికి నాయకులతో కలిసి నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, కేశవులు, తదితరులున్నారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కడ్తాల్ మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం, యువజన కాంగ్రెస్, యువజన సంఘాల ఐక్యవేదిక, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా పూలే జయంతి నిర్వహించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, తాలుకా ఉపాధ్యక్షుడు షాబోద్దీన్ పాల్గొన్నారు. పూలే అణగారిన వర్గాల్లో అక్షర దీపాన్ని వెలిగించి, గొప్ప సంఘ సంస్కర్తగా ఎదిగారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి ప్రజా, కుల సంఘాలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కమిషనర్ సునిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేష్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.నర్సింహమాదిగ, బీఆర్ఎస్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్, ఎంఎస్ నటరాజ్, చంద్రశేఖర్, అగ్గనూరి బస్వం, రాజేందర్‌రెడ్డి, తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జయంతి నిర్వహించారు. మాడ్గుల మండల కేంద్రంతో పాటు ఇర్విన్‌లో పూలే జయంతి నిర్వహించారు. పల్లేటి వెంకటయ్య, కట్ట అంజయ్య, తదితరులున్నారు. యాచారం మండలం కుర్మిద్దలో ఉపాధి పనులు చేస్తున్న చోట సీపీఎం కార్యకర్తలు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల్లర్పించారు. కొత్తపల్లిలో సీపీఎం నాయకుడు జగన్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఉప్పరిగూడలో పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. హెచ్ఎం లక్ష్మి, జిల్లా వెంకటేష్ తదితరులున్నారు. ఇబ్రహీంపట్నం చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సామేల్, మధుసూదన్‌రెడ్డి, బుగ్గరాములు, తదితరులున్నారు. ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు వి.పరమేష్, ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిని జయంతి నిర్వహించారు. కాగా, మోదీ పాలన ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా కాలరాస్తోందని, దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనుభావుల ఆశయాలకు తూట్లు పొడుస్తోందని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ తల పెట్టిన జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంతో పాటు పూలే జయంతిని మహేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిర్వహించారు. మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, వైస్‌చైర్మన్ సీహెచ్ యాదయ్య, ఏనుగు జంగారెడ్డి, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, కాకి ఈశ్వర్, అల్లె కుమార్, లాజర్, రాజునాయక్ ఉన్నారు. సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రాజ్, నాయకులు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సామయ్య, సురేష్, దేవేందర్‌లు పూలే జయంతిని పురస్కరించుకొని కందుకూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్.వెంకటేశ్, రూప్‌చందర్, తదితరులున్నారు. కొత్తూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద గల పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు శ్రీనివాస్, సోమ్లనాయక్, నాయకులు యాదయ్య, గోపాల్‌గౌడ్, జె. శ్రీను, జంగగళ్ల కృష్ణయ్య, రవినాయక్, బండి కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, మాదవరెడ్డి, సాగర్, రాఘవేందర్‌యాదవ్ తదితరులున్నారు. కొందుర్గు, జిల్లేడ్ చదరిగూడ మండల కేంద్రాల్లో పూలే జయంతి నిర్వహించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యాలయంలో నివాళులర్పించారు. బాబురావు, రాములు, వెంకటేష్, తదితరులున్నారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని పీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తుమ్మల గోపాల్ అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కిసాన్‌సెల్ అధ్యక్షుడు కొడూరు రాములు, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు రాణి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు తదితరులున్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే అని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభాకర్, సయోజిరావ్, సుగుణాకర్‌రావు, రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.



తలకొండపల్లి : పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మహేశ్వరం : నివాళులర్పిస్తున్న భాస్కర్‌రెడ్డి తదితరులు



ఇబ్రహీంపట్నం : జయంతి వేడుకల్లో పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చౌదరిగూడ : ఉత్తరాస్‌పల్లిలో నిర్వహించిన పోషకాహార పక్షోత్సవాల్లో అధికారులు

కడ్తాల్/చౌదరిగూడ/కేశంపేట, ఏప్రిల్ 11(ఆంధ్ర జ్యోతి): ఆహారంలో నిత్యం చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక రోగాలు చాలా వరకు దరిచేరవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. పౌష్టికాహారం సంపూర్ణ ఆరోగ్యానికి ఉపకరిస్తుందన్నారు. కడ్తాల మండలం రావిచెడ్‌లోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. టీచర్లు సుజాత, నస్రీన్‌సుల్తానా, వాణిశ్రీ, సువర్ణ, ఆశా కార్యకర్తలు అనిత తదితరులు పాల్గొన్నారు. అలాగే పోషకాహారంతో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జోత్స్న అన్నారు. కొందుర్గు మండలం ఉత్తరాస్‌పల్లి పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. టీచర్ శారద, గర్భిణీలున్నారు. ప్రజారోగ్యంలో అంగన్వాడీల పాత్ర కీలకంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ అన్నారు. కేశంపేట మండలం కాకునూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా పోషణ మాసం నిర్వహించారు. టీచర్లు మాధవి, మంజుల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఝాన్సీ, పద్మ తదితరులున్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

షాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. శుక్రవారం షాబాద్‌లో ముదిరాజ్ భవన్‌లో పార్టీ మండలాధ్యక్షుడు మాణయ్య ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. రేషన్ షాపుల్లో ఇస్తున్న సన్నబియ్యం కేంద్రమే ఇస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్, సీనియర్ నాయకులు బాబయ్య, రవీందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల, షాబాద్ మండలాధ్యక్షులు అనంతరెడ్డి, మాణయ్య, మండల ప్రధాన కార్యదర్శి హరీష్, నాయకులు బూత్ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా మంచిరెడ్డి జన్మదిన వేడుకలు



కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం/యాచారం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం స్వగ్రామమైన ఎలిమినేడులో ఘనంగా జరిగాయి. పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆయనచే కేక్ కట్ చేయించి శాలువాలతో సత్కరించారు. కిషన్‌రెడ్డి సతీమణి ముకుందమ్మ, కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, మంచిరెడ్డికి యాచారం మండల బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు కె.రమేష్‌గౌడ్, పి.భాషా, వి.రాజునాయక్, శంకర్‌నాయక్ తదితరులున్నారు.

చందన్‌వెల్లిలో నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

షాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నేడు(శనివారం) అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌లు హాజరౌతున్నారని, మండల ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మాడ్గుల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్కపల్లిలో నూతనంగా నిర్మించే బీరప్ప కమరావతి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కల్లు తిరుపతిరెడ్డి రూ.2లక్షల విరాళం కురుమ కులస్తులకు శుక్రవారం అందచేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని చెప్పారు. కాస పర్వతాలు, బండ రాములు, బండ పర్వతాలు, తదితరులున్నారు.

ముస్లింల నిరసన ర్యాలీ

షాద్‌నగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డుకు సవరణ దేశ చరిత్రలోనే చీకటి అధ్యాయంలా మిగిలిపోతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. శుక్రవారం సాయంత్రం షాద్‌నగర్ పట్టణంలో ముస్లిం మైనార్టీలు నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ నిబంధనలకు తలొగ్గి మత విద్వేశాలకు పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు.

ముగ్గు పోసి.. పునాదులు తవ్వి!

(5వ పేజీ తరువాయి)

పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. తక్కువ ఖర్చుతో ఇళ్లు నిర్మించేందుకు జిల్లా వ్యాప్తంగా 40 మంది మేస్త్రీలకు ట్రైనింగ్ ఇచ్చారు. 300 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. నిర్మాణ ప్రకియలో భాగంగా ఇప్పటి వరకు 86 ఇళ్లు పునాదుల వరకు పనులు జరిగాయి. బేస్‌మెంట్ లెవల్‌లో 58 ఇళ్లు ఉన్నాయి.

దశల వారీగా డబ్బులు

ఇల్లుకు ముగ్గు పోసినప్పుడు, బేస్‌మెంట్, స్లాబు, గోడలు, ప్లాస్టరింగ్ ఇలా వివిధ దశల్లో నిర్మాణం జరుగుతున్న ఫొటోలను అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ముగ్గు పోసినప్పుడు తీసిన లోకేషన్‌కు, తర్వాత వివిధ దశలలో నిర్మాణం జరుగుతున్నప్పుడు తీసిన లోకేషన్ ఫొటోలు సరిపోలితేనే బిల్లులు చెల్లిస్తారు. పునాది దశలో రూ.లక్ష, లెంటర్ లెవల్‌లో రూ.2 లక్షలు, పూర్తయిన తర్వాత మిగతా రూ.2 లక్షలు దశల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

నిర్మాణంలో ఆలస్యం..

పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి సొంతింటి కలను నెరవేర్చాలని నిర్ణయించింది. స్థలాలు ఉన్నవారు ఇల్లు నిర్మాణానికి త్వరగా ముందుకు రావడం లేదు. పనులు ప్రారంభించేందుకు కొంతమంది ముహూర్తాలు లేవని, మరికొందరు ఆర్థికంగా లేకపోవడంతో ఆలస్యం చేస్తున్నారు.

కనిపించని నమూనా ఇల్లు

ప్రతీ మండల కేంద్రంలో ఒక నమూనా ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటికోసం రూ.5లక్షలు చొప్పున వెచ్చించి నిర్ణీత చదరపు అడుగుల సైజులో నిర్మించే ఇంటి కోసం స్థలాన్ని ఎంపిక చేశారు. వాస్తవానికి ఎంపీడీవో కార్యాలయాల్లోనే వీటిని నిర్మించాల్సి ఉండగా, స్థలం లేకపోవడంతో ఇతర ప్రాంతాలను ఎంపిక చేశారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు నిర్మించాల్సిన నమూనా ఇల్లు ఎక్కడా పూర్తయిన దాఖలాలు లేవు.

అక్రమాలు జరగకుండా..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తప్పనిసరిగా 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న స్థలాన్ని కలిగి ఉండాలని నిర్ణయించారు. నిర్ణీత కొలతల్లోనే ఇల్లు నిర్మాణం చేపడితేనే బిల్లులు చెల్లిస్తారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయి. ఇల్లు నిర్మించకుండానే బిల్లులు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి అలాంటి వాటికి అవకాశం లేకుండా చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

ఏఈలకు ఒక యాప్..

ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఒక యాప్‌ను కేటాయించారు. వారు ముగ్గు పోసిన ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అలాగే ఇల్లు నిర్మాణం జరిగే స్థలం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్నది లేనిది యాప్‌లో పొందుపర్చుతున్నారు.

నిర్ణీత కొలతలు లేకుంటే తిరస్కరణ

ఏఈలు బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇళ్లను పరిశీలించి స్థలం కొలతలు తీసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఉంటేనే ఫొటో అప్‌లోడ్ చేస్తారు. డీఈలు సూపర్‌చెక్ చేసి అన్ని సక్రమంగా ఉంటేనే బిల్లుల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు. నిర్ణీత కొలతల ప్రకారం లేని ఇళ్లను నిరభ్యంతరంగా తిరస్కరిస్తారు. లబ్ధిదారులు సరి చేసుకుంటే పునః పరిశీలనకు అవకాశం ఉంది.

మొదటి బిల్లు ఇంకా రాలేదు



ఇంటి నిర్మాణానికి ఇంకా మొదటి బిల్లు రాలేదు. ఇప్పటి వరకు పునాదులు తీసి, పిల్లర్ గుంతలు తవ్వించాను. పిల్లర్స్ పుట్టింగ్ కూడా పూర్తయ్యింది. బేస్‌మెంట్ కంప్లీట్ అయ్యింది. అధికారులు వచ్చి ఫొటో తీసుకుని వెళ్లారు. ఇంకా బిల్లు రాలేదు. ఇప్పటి వరకు సొంత ఖర్చులతోనే నిర్మాణ పనులు చేసుకుంటున్నాను. అధికారులు స్పందించి త్వరగా బిల్లు ఇప్పించాలి.

- వి.పావని, పులుసుమామిడి, జిల్లేడు చౌదరిగూడ మండలం

అంబలి కేంద్రం ఏర్పాటు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్ర జ్యోతి): షాద్‌నగర్ వాసవి ఫైనాన్స్ అధినేత బండారి రమేష్ తన తల్లిదండ్రులైన రాజయ్య, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటుచేసిన కేంద్రాన్ని శుక్రవారం రమేష్ ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, న్యాయవాది మహేందర్‌రెడ్డి, కమ్మదనం సుధాకర్, చెట్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలి

తలకొండపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం స్ఫూర్తితో తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కల సాకారమైందని మిషన్ భగీరథమాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. గుండూరులో ఈనెల 14న నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను, ఆహ్వాన పత్రికలను శుక్రవారం వెంకటేశ్ నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు.

ఉత్తమ జర్నలిస్టులకు 'ఉగాది పురస్కారాలు'

- నేడు అందజేయనున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

షాద్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాల నుంచి పేదల గొంతుకను వినిపిస్తున్న షాద్‌నగర్ పట్టణ జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు. నేడు(శనివారం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ ఈ పురస్కారాలను అందజేయనున్నారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఎండీ ఖాజాపాషా, మిద్దెల సత్యనారాయణ కొన్ని సంవత్సరాలుగా పేదల సంక్షేమం కొరకు తమ గొంతుకను వినిపించారు. అలాగే ఎండీ ఖాజా పాషా ఒక జర్నలిస్టుగా.. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన్ను ప్రత్యేకంగా గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 34 విభాగాల్లో 97 మందికి ఈ ఉగాది పురస్కారాలు అందజేయనున్నారు.

పుస్తె, మెట్టెలు వితరణ

కేశంపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పల్లె బ్రదర్స్- ఆనంద్ కుమార్, బాలీశ్వర్‌లు ఉదారత చాటుకున్నారు. పేదింటి వివాహానికి తమవంతుగా పుస్తె, మెట్టెలు అందించారు. కొండారెడ్డిపల్లికి చెందిన అంజమ్మ-లింగమయ్య దంపతుల కుమారుడు నరేష్ వివాహం శుక్రవారం నిర్వహించారు. పల్లె బ్రదర్స్ అనుచరులతో పుస్తె, మెట్టెలు పంపించారు. ఈమేరకు వారికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, మల్లేష్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి చేయూత

కడ్తాల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మైసిగండికి చెందిన కేతావత్ బాబులాల్-లక్ష్మీ దంపతుల కూతురు చాందిని వివాహానికి బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు రాందాస్ నాయక్ చేయూతనందించారు. శుక్రవారం చాందిని వివాహం నేపథ్యంలో రాందాస్ నాయక్-సంతోష దంపతులు రూ.10 వేలు సమకూర్చి వారికి అందజేశారు.